క్లుప్తంగా

త్వరలో ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభం

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంతో పాటు దేగాంలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలలకు అనుమతిచ్చినట్లు ఎంఈవో మేస నరేందర్ మంగళవారం తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయునితో పాటు ఒక ఆయాను నియమించనున్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ట్రెయినింగ్ పూర్తి చేసిన వారికి ఉపాధ్యాయునిగా అవకాశం కల్పించనున్నారు. అలాగే ఆయాల నియామకానికి ఏడో తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 15లోగా ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. డీఈవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితాను వెల్లడించనున్నట్లు ఎంఈవో తెలిపారు.

ఘనంగా సీతారాం ఏచూరి జయంతి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతిని ఆర్మూర్ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్, సభ్యులు కొండ గంగాధర్, నాగరాజు, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



రుద్రూర్: సమస్యను విన్నవించేందుకు జగిత్యాల కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగుడిని ఈడ్చుకెళ్లడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జగిత్యాల కలెక్టరేట్‌లో దివ్యాంగుడైన రాజ గంగారాం ను అగౌరవ పరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కన్నం శ్రీనివాస్, వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు శివ, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళిక కార్యాచరణ



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 3, 17వ వార్డుల్లో ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు ఇంటింటికి తిరుగుతూ.. సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ చేయాలని, సీజనల్ వ్యాధులపై జాగ్రత వహించాలన్నారు. తడి, పొడి చెత్తను ఇంటింటికి వచ్చే మున్సిపల్ సిబ్బందికి వేర్వేరుగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, వార్డు అధికారులు, చక్రధర్, దినేశ్, శానిటరి జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వర్ని: మండలంలోని జాకోర గ్రామానికి చెందిన గుండ్ల సైదయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబానికి జాకోర సొసైటీ చైర్మన్ దశరథ్, డైరెక్టర్ విష్ణువర్ధన్ రూ. ఏడు వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. డైరెక్టర్లు చీమల లక్ష్మయ్య, దత్త గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం మెండోరా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో శ్రీకృష్ణుడు, బాలికలతో గోపికల వేషం వేయించారు. ఉట్టి పగులకొట్టే కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ముత్తెన్న, వీడీసీ చైర్మన్ గౌర్ రాజన్న, ఉపాధ్యక్షుడు గుడిసె సాయిబాబా, కోశాధికారి గజిరి గంగారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ఎలిశాల మానస తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాపై పట్టింపేది..?

- శిథిలావస్థలో కుద్వాన్‌పూర్ సబ్‌సెంటర్ భవనం
- పిచ్చి మొక్కలతో ఆస్పత్రి ఆవరణ
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పల్లె దవాఖానా ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు



కుద్వాన్‌పూర్‌లో శిథిలావస్థలో ఉన్న పల్లె దవాఖానా

నందిపేట్: మండలంలోని కుద్వాన్‌పూర్‌లో ఉన్న పల్లె దవాఖానా శిథిలావస్థకు చేరింది. ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రెండేళ్ల క్రితం ముందు జాగ్రత్తగా పక్కనే ఉన్న ఆయుర్వేద ఆస్పత్రిలోకి సిబ్బంది మారారు. ప్రస్తుతం ఆ భవనం కూలిపోయే స్థితికి చేరింది. నూతన భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం నిధుల మంజూరుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు.

ఒకే గదిలో ఆస్పత్రి

పల్లె దవాఖానా భవనం కూలిపోయే దశకు చేరడంతో రెండేళ్ల క్రితం గ్రామంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో ఒక గదిని కేటాయించారు. ఒకే గదిలోనే మందుల స్టాక్‌తో పాటు ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుకు ఇద్దరికి మాత్రమే వైద్య సేవలు అందించడానికి వీలవుతోంది. రోగుల సంఖ్య ఎక్కువైతే వైద్య సిబ్బందితో పాటు రోగులు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఆవరణ అంతా చెట్లపొదలు

పల్లె దవాఖానా ఆస్పత్రి ఆవరణ అంతా పిచ్చి మొక్కలు, చెట్ల పొదలతో నిండిపోయింది. ఆస్పత్రికి ఉన్న తలుపులు, కిటికీలు విరిగి పోయాయి. ఈ భవనం కుక్కలు, పందులు, పాములకు నిలయంగా మారింది. ఇకనైనా పాలకులు స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **నిధులు మంజూరు కాలేదు**
>
> కుద్వాన్‌పూర్‌లోని పల్లె దవాఖానా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపించాం. అలాగే దవాఖానాలోని పలు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం గ్రామంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నాం.
>
> – డాక్టర్ ప్రవీణ్, మండల వైద్యాధికారి, నందిపేట

రోడ్డు ప్రమాదాలకు చెక్ పడేలా..



కమ్మర్‌పల్లిలో బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న సీపీ, కలెక్టర్



పెర్కిట్ జాతీయ రహదారిపై..

కమ్మర్‌పల్లి/ఆర్మూర్‌టౌన్/మాక్లూర్/ఖలీల్‌వాడి: జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు చెక్ పడేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య జిల్లా పరిధిలోని పలు బ్లాక్ స్పాట్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అంక్సాపూర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న సీపీ

అన్ని ఎత్తిపోతల పథకాలు ప్రారంభించాలి

వేల్పూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరా ప్రారంభించి చెరువులు నింపాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మంగళవారం రాత్రి పత్రికా ప్రకటన లో డిమాండ్ చేశారు. వర్షాకాలం మొదలై మూడు నెలలు కావస్తున్నా జిల్లాలో, బాల్కొండ నియోజక వర్గంలో గాని చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదన్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 1086 చెరువులు ఉంటే 377 చెరువులు 25 శాతం, 424 చెరువులు 50 శాతం, 204 చెరువులు 75 శాతం నిండాయని పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 292 చెరువులకు గాను ఒక్క చెరువు కూడా పూర్తిస్థాయిలో నిండలేదన్నారు. గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, లక్ష్మీకాలువ, అనేక లిఫ్టుల ద్వారా నీటి సరఫరా ప్రారంభించి ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్‌రూరల్ నియోజకవర్గాల్లోని అన్ని చెరువులు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆలూర్‌లో సొసైటీ సర్వ సభ్య సమావేశం

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ తంబూర్ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి మల్లేశ్ ఆదాయ, వ్యయాలతో పాటు అంచనా బడ్జెట్‌ను చదివి వినిపించారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు కళ్లెం భోజా రెడ్డి, కళ్లెం సాయా రెడ్డి, బార్ల సంతోష్ రెడ్డి, ఇంగు గోవర్ధన్, సింగిడి మల్లుబాయి, ప్రమోద్ కుమార్, ఆరె రాజేశ్వర్, వెల్మ నర్సారెడ్డి, పచ్చుక లసుంబాయి, కట్ట నర్సయ్య, గొల్ల గంగాధర్, సిబ్బంది ముత్యం, దేవరాజ్, గంగాధర్, గంగారాం, శ్రీకాంత్, సురేశ్ పాల్గొన్నారు.



సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపిస్తున్న కార్యదర్శి

న్యాయవాదులకు ఆటల పోటీలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టులో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ బార్ న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్, న్యాయవాదులు లోక భూపతి రెడ్డి, తులసీదాస్ క్రాంతి, ఎంకే నరేందర్, చిలుక కిష్టయ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గటడి ఆనంద్, లైబ్రరీ సెక్రెటరీ శ్రావణ్ కుందారం తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ వైద్యశిబిరం



ఆర్మూర్‌లో చిన్నారులకు చికిత్స చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ అరుణ



భీమ్‌గల్‌లో..

ఆర్మూర్: పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో వైకల్యంతో బాధపడే పిల్లలకు మంగళవారం ఉచిత ఫిజియోథెరఫీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలను అందిస్తుననట్లు తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ అరుణ చిన్నారులకు ఫిజియోథెరపీ అందించారు. శిబిరంలో ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ కిషన్, సురేశ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: భీమ్‌గల్ మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరఫీ వైద్యశిబిరం నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ మనీషా వైకల్యంతో బాధపడే పిల్లలకు ఫిజియోథెరపీ అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు జలంధర్, కిషన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జలాల్ బుకారి దర్గాను సందర్శించిన సీపీ

బోధన్‌టౌన్: బోధన్‌లోని రెంజల్ బేస్‌లో ఉన్న జలాల్ బుకారి దర్గాను సీపీ సాయి చైతన్య సోమవారం రాత్రి సందర్శించారు. దర్గాపై చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉర్సు ఉత్సవాలను పర్యవేక్షించారు. ఉత్సవాలకు నిర్వహిస్తున్న బందోబస్తు వివరాలను ఏసీపీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, పోలీసులు ఉన్నారు.

కొనసాగిన ఉత్సవాలు

బోధన్‌లోని రెంజల్ బేస్‌లో ఉన్న సయ్యద్ షా జలాల్ బుకారి దర్గా ఉర్సు ఉత్సవాలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. పట్టణ ప్రజలే కాకుండా మహరాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల ప్రజలు దర్గాను సందర్శించి చాదర్ కప్పి మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవాలి కార్యక్రమం రాత్రి సాగింది.



రాంచందర్‌రావు అరెస్టుపై నిరసన

బోధన్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం సమంజసం కాదని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్ మంగళవారం అన్నారు. హైదరాబాద్‌లోని పెద్దమ్మ ఆలయంలో తలపెట్టిన కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న రామచంద్రారావును పోలీసులు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేయడంపై నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మవారి గుడిని కూల్చడమే కాకుండా ఇలా అక్రమ అరెస్టులు చేయడం మైనార్టీల మన్నన పొందడం కోసమే అని పేర్కొన్నారు.

భూములను సర్వే చేయించాలి

రుద్రూర్: రైతుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు విమర్శించారు. పొతంగల్ శివారులోని సర్వే నంబర్ 632 నుంచి 641 వరకు భూములను మంగళవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీపీఎం పార్టీ పోరాటల ఫలితంగా గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పేదలకు భూమి పంపిణీ చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. నాటి నుంచి భూసర్వే చేయించి రైతులకు భూమి అప్పగించాలని విజ్ఞప్తులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. దీంతో కొందరు వ్యక్తులు పట్టాదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పొతంగల్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్, నాయకులు శకుంతల, నారాయణ, బాలయ్య, శంకర్, రాములు, అఫీజ్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



భూములను పరిశీలిస్తున్న పెద్ది వెంకట్రాములు

ఎన్‌ఎఫ్‌బీ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

రుద్రూర్: అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం(ఎన్ఎఫ్‌బీ) సద్వినియోగం చేసుకోవాలని పోతంగల్, కోటగిరి మండలాల ప్రత్యేకాధికారులు రోహిత్ రెడ్డి, అలీమ్ హైమద్, తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఈ పథకం వర్తిస్తుందని, మరణించినా వ్యక్తి వయస్సు 18 ఏళ్లు పైబడి, 60 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా రూ.20వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అర్హులైన వారు మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రోహిత్ రెడ్డి

బోధన్‌రూరల్: మండలంలో అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలు ఎన్ఎఫ్‌బీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విఠల్ కోరారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా రూ. 20 వేల ఆర్థికసాయం అందుతుందని అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాచారం..

▪ నేడు నిరసన ప్రదర్శనలు

మాక్లూర్: భారతదేశంలో బహుళజాతి కంపెనీల ప్రమేయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శలు చేపట్టనున్నట్లు కిసాన్ సంయుక్త మోర్చా జిల్లా కన్వీనర్ డి సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. బహుళ జాతి కంపెనీలు దేశం విడిచిపోయేలా రైతులు, కార్మికులు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాన్ని రైతులు, కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

▪ మహా మార్కింగ్ మేళా

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లను నిర్మించుకునేందుకు బుధవారం మహా మార్కింగ్ మేళా చేపడుతున్నట్లు కమిషనర్ రాజు మంగళవారం తెలిపారు. శుభ ముహూర్తం ఉన్నందున పట్టణంలో సుమారు 20 చోట్ల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

▪ రేపు ఉత్సవ కమిటీ సమావేశం

బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీ ఏకచక్రేశ్వర శివాలయంలో గురువారం సార్వజనిక్ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. సమావేశంలో 2025–26 నూతన గణేశ్ సార్వజనిక్ ఉత్సవ కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి పట్టణ ప్రముఖులు, యువకులు హాజరుకావలని కోరారు.

ఆర్మూర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి



ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో మంగళవారం కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆర్మూర్ పట్టణ అభివృద్ధితో పాటు పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని, మెరుగైన వైద్యసేవలను అందించడానికి అవసరమైన పరికరాలను మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. అదేవిధంగా ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 కోట్లు సైతం మంజూరు చేయాలని కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 4 లక్షలు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బద్దం రమేశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎంఈవో అంద్రయ్యకు అందజేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సున్నం మోహన్, కొత్తపల్లి గణేశ్, దేవేందర్, కుంట రమేశ్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఉనికిని కాపాడుతాం



మాట్లాడుతున్న శ్రీపతి శేఖర్‌రెడ్డి

వేల్పూర్: ఉత్తమ విద్యను అందించే చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలల ఉనికిని కాపాడుతామని బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆర్మూర్ డివిజన్ ప్రైవేటు స్కూళ్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో ప్రైవేటు స్కూళ్లు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నంబుల గిరి, రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, షఫీ, రవీందర్, హరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలి



నందిపేట్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరుతూ మంగళవారం నందిపేట మండలం అయిలాపూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏఐపీకేఎంఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనతంరం జీపీ కార్యదర్శి సాయి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, కిషన్ ప్రకాశ్, విఠల్,

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి



రెంజల్: భూభారతి రికార్డులను వెంటనే పరిష్కరించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. మంగళవారం రెంజల్‌లోని తహసీల్ కార్యాలయాన్ని పరిశీలించారు. గతంలో నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో విచారించి దరఖాస్తులకు మోక్షం కలిగించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తం

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పీఎస్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు బుధవారం అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. బాధితులు జయబేరి, వసంత, మొహమ్మద్ ఆరిఫ్, సల్మాన్‌లకు పోయిన ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని అందించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రుద్రూర్: బాధితులు పోగొట్టుకున్న ఐదు సెల్ ఫోన్లను బాధితులకు మంగళవారం పీఎస్‌లో అందించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బాధితులు ఫోన్లు పోయిన వెంటనే ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెర్చ్ చేసి వాటిని గుర్తించినట్లు గుర్తించామని ఎస్సై పేర్కొన్నారు.

పోగొట్టుకున్న డబ్బులు అప్పగింత

రుద్రూర్: సైబర్ మోసానికి గురై డబ్బులు పోగొట్టుకున్న బాధితుడికి తిరిగి ఆ డబ్బును రీఫండ్ చేయించినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోటగిరి మండలం సుద్దులం తండాకు చెందిన డి. యోగేశ్ అనే వ్యక్తికి 12మార్చి2025న ఫోన్‌లో వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్ చేశాడు. దీంతో వెంటనే సైబర్ నేరస్తులు అతని ఖాతాలో ఉన్న డబ్బులను కాజేశారు. విషయం గుర్తించిన బాధితుడు కోటగిరి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సైబర్ క్రైమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేశారు. మంగళవారం బాధితుడికి రూ. 2112లు రీఫండ్ చేయించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద లింకులు పంపితే ఓపెన్ చేయొద్దని ఎస్సై సూచించారు.

వైభవంగా గణపతి ఆలయ వార్షికోత్సవం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని సంకట విమోచన గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద నవగ్రహ పూజ, గణపతి హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కొనసాగిన విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలోని శివాలయంలో సోమవారం ప్రారంభమైన పార్వతీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం కొనసాగాయి. వేదపండితులు కొచగంటి శశికుమార్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు స్థాపిత దేవతాపూజ, యాగమండప హోమం, ధాన్యదివాసము తదితర పూజలు నిర్వహించారు. బుధవారం శ్రీ హంపీవిరూపాక్షవిద్యారణ్య స్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం ఉంటుందని అన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



వర్ని(మోస్రా): మోస్రా మోటాడిరెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిల్ల రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జంగా అక్షయ రెడ్డి, ఉపాధ్యక్షులుగా టేకుల భానుచందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా పెద్దంగారి నాగిరెడ్డి ఎన్నికయ్యారు.